క్లుప్తంగా

ఉక్కు మంత్రి మీద విశ్వాసం ఉంటే ఇంకా దీక్షలెందుకు?

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారని చెబుతున్న పోరాట, పరిరక్షణ కమిటీ నాయకులు కూర్మన్నపాలెంలో దీక్షలు ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నారో స్పష్టం చేయాలని విశాఖ ఉక్కు కార్మిక సంఘం నాయకుడు పట్టా రామ అప్పారావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని నిజంగా ఉక్కుశాఖ మంత్రి బహిరంగ ప్రకటన చేశారా? లేదా నాయకులే అలా ప్రచారం చేస్తున్నారా?..ఇక్కడ జరిగిన పరిణామాలను ఢిల్లీ పెద్దలకు వివరిస్తానని మాత్రమే హామీ ఇచ్చారని, అలాంటప్పుడు కుమారస్వామి ఎలా పరిరక్షిస్తారని నమ్ముతున్నారో అర్థం కావడం లేదని ఆరోపించారు. ఉక్కు ప్రైవేటీకరణపై స్పష్టమైన హామీ లభిస్తే కేంద్ర మంత్రి చేత ఉక్కు దీక్షలు ఎందుకు విరమింపజేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో దానబాల త్రిమూర్తులు, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మంగరాజుకు సత్కారం



మంగరాజును సత్కరిస్తున్న వెంకటరావు, గోవింద్, రామునాయుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని కొత్త కర్నవానిపాలేనికి చెందిన కులుకూరి మంగరాజును వైఎస్సార్ సీపీ నాయకులు రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్, జి.రామునాయుడును ఆదివారం సత్కరించారు. సామాజిక సేవారంగంలో అపార సేవలందిస్తున్న మంగరాజు కృషిని గుర్తించి కేంబ్రిడ్జి యూనివర్సిటీ (యూఎస్ఏ) ప్రతినిధులు ఇటీవల న్యూఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న యూత్ అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ: సోమేశ్వర స్వామి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని యూత్ సభ్యుడు గరికిన మహేష్ ప్రారంభించారు. అనంతరం సుమారు 70 మంది రక్తదానం చేశారు. వీరికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి కమల్‌హాసన్, సూరడ కొండయ్య, అర్జిలి కోదండరావు, ముత్తి వీర్రాజు, ఎం సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సత్యసాయి సభ్యులు



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న డీజీఎం సురేష్, కాలనీ సభ్యులు

ఉక్కునగరం: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో పలుప్రాంతాల్లో మొక్కలు నాటారు. సత్యసాయి జయంతి సందర్భంగా జాతీయస్థాయిలో 'ప్రేమ తరు' పేరిట కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ వాటర్ మేనేజ్‌మెంట్ విభాగం డీజీఎం, ఎస్టీ.బి.ఎల్ వాస్తవ్యులు పి.సురేష్ ఆర్థిక సాయంతో 108 జాతి మామిడి మొక్కలు నాటారు. సత్యసాయి సేవా సమితి సభ్యులతో సురేష్, ఎస్టీ.బి.ఎల్ కాలనీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

దుమ్ము, ధూళితో నిండిపోతున్న పోర్టు రోడ్డు



పోర్టు రోడ్‌లో ఇదీ పరిస్థితి

గాజువాక: గాజువాకలోని పోర్టు రోడ్ దుమ్ము, ధూళితో నిండిపోతోంది. పారిశ్రామిక బొగ్గు, జిప్సం, ఇసుక ఖనిజం వంటి మెటీరియళ్లతో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు నిబంధనలను పాటించకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. స్థానిక వందడుగుల రోడ్ నుంచి జగ్గు జంక్షన్ మీదుగా పోర్టు రోడ్‌లోని వై జంక్షన్ వరకు పరిస్థితి దారుణంగా మారిందని నివాసులు వాపోతున్నారు. పారిశ్రామిక మెటీరియల్స్‌తో ఈ రోడ్‌లో రాకపోకలు సాగిస్తున్న లారీలు, టిప్పర్లవంటి భారీ వాహనాలవల్ల కాలుష్యం కమ్మేస్తోందని సుమారు పది కాలనీలకు చెందిన నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రయాణానికి ఊపిరాడటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరం పోర్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్లనుంచి ప్రతిరోజు వందలాది లారీలు, టిప్పర్లు స్వతంత్రనగర్, దుర్గానగర్, వై.జంక్షన్, పాత కర్ణవానిపాలెం, అఫీషియల్ కాలనీ, జగ్గు జంక్షన్, వందడుగుల రోడ్ మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటాయి. బొగ్గు, జిప్సం, ఇనుప ఖనిజం, గంధకం పొడి వంటి రసాయన పదార్థాలను రవాణా చేస్తుంటాయి. పోర్టు రోడ్ మొదలుకొని ఇటు జాతీయ రహదారిపై కూడా లారీల్లోని మెటీరియల్ రోడ్లమీదే పడిపోతోంది. లారీలు, టిప్పర్లతో పెద్ద మొత్తంలో సరుకు వెళ్తున్నా కనీస ప్రమాణాలు పాటించడంలేదు. రోడ్లపైనే మెటీరియల్ పడిపోవడం, వాటి వెనుక వెళ్తున్న వాహనాలు ఆ మెటీరియల్‌పై నుంచి వెళ్తుండటంతో దుమ్ముగా మారి వాహన చోదకుల కళ్లలోకి పడిపోతోంది. కాలుష్యం పొగ మాదిరిగా కమ్మేస్తోంది. అధికలోడు, టార్పాలిన్ సరిగా కట్టకపోవడం, తొందరగా ట్రిప్పులు వేయాలన్న ఆదుర్దా కారణంగా ఆ రోడ్‌లోని కాలనీల నివాసులకు కూడా శాపంగా మారుతోంది.

కమ్మేస్తున్న దుమ్ము, ధూళి

వై.జంక్షన్, జగ్గు జంక్షన్ మీదుగా జాతీయ రహదారివైపు రాకపోకలు సాగిస్తున్న లారీల కారణంగా కాలుష్యం అధికమవుతోంది. దుమ్ము, ధూళి ఎగిరిపడి ఇళ్లల్లోకి చేరుతోందని ఈ రోడ్‌ను ఆనుకొని ఉన్న నివాసులు గగ్గోలు పెడుతున్నారు. తలుపులు మూసుకున్నా ఇళ్లల్లోకి దుమ్ము ఆగడంలేదని చెబుతున్నారు. కాగా, లారీల వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకొంటుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యాలతో అవస్థలు

కాలుష్యం కారణంగా అనారోగ్యాలకు గురవుతున్నామని నివాసులు పేర్కొంటున్నారు. కళ్ల మంటలు, ముక్కు దిబ్బడ, జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, శ్వాస సరిగ్గా ఆడకపోవడం, గుండెదడ, కండరాల నొప్పులు, శ్వాసకోశ వ్యాధులు, క్షయ, ఉబ్బసం, ఎలర్జీ, చర్మ వ్యాధులు చోటు చేసుకొంటున్నాయని చెబుతున్నారు ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు ఈ కాలుష్యం బారిన పడి తీవ్ర దుష్పరిణామాలకు లోనవుతున్నారని పేర్కొంటున్నారు.

సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం అన్యాయం



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉక్కు వైఎస్సార్ టీయూసీ నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆనుకొని ఉన్న మెడ్‌టెక్ సందర్శనకు ఇటీవల వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ఉక్కు కార్మిక సంఘాల నేతలు అపాయింట్‌మెంట్ అడిగితే ముఖం చాటేయడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ, వైఎస్సార్ టీయూసీ నాయకులు డి.ఆదినారాయణ, పిట్టారెడ్డి, ఎస్.రామారావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలోని నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 1249వ రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి గెలుపుతో ఉక్కు కార్మికుల్లో ఆశలు చిగురించాయని, అయితే చంద్రబాబు కార్మికులను కలవడానికి అవకాశం కల్పించకపోవడంతో నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధి కల్పించే కల్పతరువులాంటి విశాఖ ఉక్కు విషయంలో కేంద్ర ఉక్కు శాఖామంత్రి కుమారస్వామి స్పష్టమైన హామీ ఏదీ ఇవ్వకపోవడం, సీఎం చంద్రబాబునాయుడు కార్మిక సంఘాల నేతలను కలవడానికి విముఖత వ్యక్తం చేయడంతో కార్మికుల్లో భయాందోళన నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, మార్టుపూడి పరదేశి, కర్రి దాలినాయుడు, బి.రామకృష్ణ, దాసరి పుల్లారావు, పిట్టా సంజీవ్‌రెడ్డి, భాస్కరరాజు, గుమ్మడి నరేంద్ర, బొజ్జ వెంకటరమణ, గొందేశి మంగరాజు, గెద్దాడ అప్పలరాజు, పి.ఉగ్రం, బి.రాజన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి విశేష పూజలు



పూజలు చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో ఆదివారం వారాహి అమ్మవారికి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. వారాహి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆషాఢ మాస శుద్ధ అష్టమి సందర్భంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనంలతో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం రుత్వికుల ఆధ్వర్యంలో ద్వాదశ వారాహీ యంత్రార్చన పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వారాహీ మూలమంత్ర హవనం, మహాపూర్ణాహుతి, వేదాశీర్వచన నిర్వహించారు. అమ్మవారికి కంద, తెల్ల ఆవాలు, తోక మిరియాలతో ప్రత్యేక మూల మంత్ర హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో జగన్నాథస్వామి



శ్రీకృష్ణావతారంలో భక్తులకు కనువిందు చేసిన జగన్నాథస్వామి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

అగనంపూడి: అగనంపూడిలోని జగన్నాథస్వామి ఆలయంలో రథోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం జగన్నాథస్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గురు సంతోష్ దర్పణ స్నానం తదనంతరం కృష్ణావతారంలో జగన్నాథస్వామిని అలంకరింపజేశారు. తరువాత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహానైవేద్యం సమర్పించారు. అగనంపూడి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్నసమారాధన నేడు

రథోత్సవాల సందర్భంగా సోమవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం పైడిరాజు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

కల్యాణ మండపం అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న దాత గోపిశెట్టి ఆదినారాయణ

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని శ్రీ కృష్ణ దేవరాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ కృష్ణ దేవరాయ కల్యాణ మండపం అభివృద్ధికి 69వ వార్డు గ్రామ వాస్తవ్యుడు, వ్యాపార వేత్త గోపిశెట్టి ఆదినారాయణ రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం నాతయ్యపాలెంలో శ్రీ కృష్ణ దేవరాయ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులైన గుడివాడ అమ్మన్న, గంధం వెంకటరావు, కర్రి నాగేశ్వరరావు, ఇందల ఈశ్వరరావు, కర్ణం నానాజీ, బంతికోట రామారావులకు చెక్‌ను అందజేశారు.

కృత్రిమ మేథస్సుపై అధ్యాపకులకు శిక్షణ



కృత్రిమ మేథస్సుపై శిక్షణలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

గాజువాక: రీచింగ్ టు న్యూ ఏజ్ ఎండ్స్ అంశంపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేథస్సు)పై ఆదివారం శిక్షణ నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లోని వివిధ అప్లికేషన్లు, వాటిపై పని చేయాల్సిన పద్ధతులపై రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ వివరించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఐసీటీ టెక్నికల్‌లతో విద్యార్థులకు సులభంగా బోధన చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, వివిధ కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

గాజువాక: ఉత్తరాంధ్ర ట్రక్ అండ్ ట్రాలర్స్ అసోసియేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విశాఖ గూడ్స్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. గాజువాకలో నిర్వహించిన అసోసియేషన్ మూడో వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. యూనియన్ ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో మరో అసోసియేషన్ పేరుతో ప్రాంతీయ బేధాలు సృష్టిస్తున్నారన్నారు. హిందీవారిపై దౌర్జన్యాలు చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం సబబు కాదని అన్నారు. ఈ విషయంపై నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన కూడా అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ఇకపై యూనియన్ సభ్యులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతిరెడ్డి, దొరరెడ్డి, సూరారెడ్డి, ఉత్తరాంధ్ర ట్రక్ అండ్ ట్రైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరామ్, ప్రతినిధులు రాజ్‌కుమార్, పిజెఆర్ఎస్ మహారథి, అరవింద్ కుమార్ మిశ్రా, ఆర్.భాస్కరరావు, ఎస్.కె.ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో మార్పును గమనిస్తుండాలి



మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దువ్వాడ ఇన్‌స్పెక్టర్ ఎర్రంనాయుడు

అగనంపూడి: ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సేవించడంతోపాటు వాటిని సరఫరా చేసే గ్యాంగ్‌ల చేతుల్లో కీలుబొమ్మలుగా యువత మారుతోందని, ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని దువ్వాడ ఇన్‌స్పెక్టర్ వావిలిపల్లి ఎర్రంనాయుడు అన్నారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాసాలమ్మ కాలనీలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయసు వచ్చిన యువత తల్లిదండ్రులు పిల్లల నడవడికలో మార్పులు గమనిస్తుండాలన్నారు. ఎటువంటి తేడా వచ్చినా వారి దిన చర్యలను గమనించాలన్నారు. నేడు ఎక్కువగా యువతే మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రహిత విశాఖగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే నిత్యం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయే వారి సంఖ్య పెరిగిపోతోందని, ఈవిషయంలో అత్యాశకు పోవడం, అవసరం లేని ప్రకటనలు, మెసేజ్‌ల జోలికి పోకుండా ఉండాలన్నారు. మహిళలపై లైంగికదాడులు అరికట్టేందుకు కట్టుదిట్టంగా పోక్సో చట్టం అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రసాద్, సతీష్, రాజు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు కల్కి చిత్రం చూపించిన అమిగోస్ సంస్థ

దాబాగార్డెన్స్: జేసీఐ వైజాగ్ పోర్టు అమిగోస్ సంస్థ 120 మంది అనాథ పిల్లల్లో ఆనందం నింపేందుకు ఉచితంగా సినిమాకు తీసుకెళ్లింది. ప్రభాస్, దీపిక పదుకొనే, అమితాబ్ బచ్చన్ ముఖ్యపాత్రల్లో నటించిన కల్కి చిత్రం చూసిన చిన్నారులు ఆ చిత్రం మహాభారతం నేపథ్యం కలిగి ఉండటంతో నీతి, విలువల గురించి తెలుసుకోలిగారు. నగరంలోని రామాటాకీస్, జగదాంబ కాంప్లెక్స్ థియేటర్లలో ఆదివారం ఈ సినిమా ప్రదర్శించారు. పిల్లలు ఈ సినిమా చూసేందుకు ఉత్సాహం చూపారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని పిల్లలతో కాసేపు ముచ్చటించారు. కొంతసేపు వారితో కలిసి చిత్రాన్ని వీక్షించారు. జేసీఐ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథలకు ఆహ్లాదకరమైన విద్య, వినోదం అందించడానికి జేసీఐ వైజాగ్ పోర్టు అమిగోస్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సినిమా నుంచి విలువైన పాఠాలు, నీతి పిల్లలు నేర్చుకోగలరని, వారు చిత్తశుద్ధి, కరుణతో జీవించడానికి ప్రేరణ పొందాలని సంస్థ భావించడం గొప్ప విషయమన్నారు. సంస్థ అధ్యక్షుడు భార్గవ్ మహర్షి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

పరమాత్ముని దయతోనే జీవన్ముక్తి

దాబాగార్డెన్స్: పాతనగరంలో ఆదివారం సంత్ నిరంకారీ మిషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంత్ సమాగం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ జోనల్ ఇన్‌చార్జి మోహినీ అహూజా సందేశమిచ్చారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం నుంచే కాక తూర్పు, పశ్చిమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, సంత్ నిరంకారీ మిషన్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాగంలో పలువురు మహిళలు లఘు నాటికలు, కవితలు, నృత్య గానాలు, బృందగానాలు, ఉపన్యాసాలిచ్చారు. అనంతరం సంత్ నిరంకారీ మిషన్ సద్గురు మాతా సుదీక్షా సత్య తెలుగు, హిందీ, మరాఠీ, ఒరియా, పంజాబీ, భోజ్‌భాషల్లో ఈ ప్రసంగించారు. సంత్ సమాగంలో ప్రేమ్ రాంచంద్, పీవీ రావు, పీఎస్ఎన్ రాజు, రాజ్‌వీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి

మార్కెటింగ్ అధికారి యాసిన్



స్టాల్స్‌ను తనిఖీ చేస్తున్న యాసిన్

విశాఖ విద్య: మద్రిపాలెం రైతు బజారును వ్యవసాయ,వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ ఆదివారం పరిశీలించారు. రైతు బజారులో ఏర్పాటు చేసిన కందిపప్పు, రైస్ స్పెషల్ కౌంటర్‌ను పరిశీలించి విక్రయాలు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు, దుకాణదారులతో మాట్లాడివారి సమస్యలు తెలుసుకున్నారు. దుకాణదారులంతా తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించేలా శ్రద్ధ తీసుకోవాలని రైతు బజార్ ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలుకు సూచించారు. వినియోగదారులకు కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు బజారులో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

జూలో కొత్త వన్యప్రాణుల సందడి



కొత్త పక్షుల ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొత్త వన్యప్రాణులు సందడి చేస్తున్నాయి. జూ వచ్చిన సందర్శకులను అలరిస్తున్నాయి. ఈ నెల 2న గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి పలు వన్యప్రాణులను విశాఖ జూకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ వన్యప్రాణులు ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ, అరుస్తూ సందడి చేస్తున్నాయి. రెండు జతల గ్రీన్ వింగ్డ్ మకావ్, రెండు జతల స్కార్లెట్ మెకావ్స్, రెండు జతల మిలటరీ మెకావ్స్, రెండు జతల మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ, రెండు జతల స్పైడర్ మంకీస్, రెండు జతల కామన్ మార్మోసెట్స్, ఒక జత మీర్‌కాట్, ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జంతు మార్పిడి విధానంలో జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చారు. జూకి వెళ్తున్న సందర్శకులకు ఇవి కనువిందు చేస్తున్నాయి. ఆదివారం సెలవు కావడంతో అధిక సంఖ్యలో పిల్లలు, పెద్దలు జూ పార్కును సందర్శించారు. గ్రీన్ వింగ్డ్ మెకావ్ స్కార్లెట్ మెకావ్స్, మిలటరీ మెకావ్స్, మీడియం సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ పక్షులను జూలో ఆఫ్రికన్ బర్డ్స్ జోన్‌లో అద్దాల ఎన్‌క్లోజర్లలో ఉంచారు. మీర్‌కాట్‌లను సింహాల ఎన్‌క్లోజరు పక్కన ప్రత్యేకంగా నిర్మించిన అద్దాల ఎన్‌క్లోజర్‌లో పెట్టారు. రెడ్‌నెక్డ్ వాల్లబీలను ఆస్ట్రిచ్‌ల పక్కన ఎన్‌క్లోజరులో విడిచిపెట్టారు. స్పైడర్ మంకీస్, కామన్ మార్మోసెట్స్‌లను కోతుల జోన్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఎన్‌క్లోజర్లలో ఉంచారు. సందర్శకులు ఆయా కొత్త వన్యప్రాణులను ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ వన్యప్రాణులు కొత్తవి కావడంతో పాటు అద్దాల ఎన్‌క్లోజర్లలో స్పష్టంగా కనిపిస్తున్నాయని సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గ్రీన్ వింగ్డ్ మకావ్



సల్ఫర్ క్రెస్టెడ్ కాకటూ



ఎన్‌క్లోజర్‌లో మీర్‌కాట్

18న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాఖ విద్య: గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్లో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా వచ్చే నెల 18న నిర్వహించతలపెట్టిన ఆత్మీయ కలయికలో పాలుపంచుకోవాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్‌ను కలసి ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. తాను తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతానని ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ వారికి హామీ ఇచ్చారు.

క్రీడల ద్వారా దేశానికి సేవ చేయొచ్చు

దాబాగార్డెన్స్: క్రీడలు మనలో ప్రతిభ వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడతాయని, వాటి ద్వారా దేశానికి సేవ చేయొచ్చని సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఆశ జాస్తి, నిత్య జాస్తి పేర్కొన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-3 విజేతగా నిలిచిన ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఆరెంజ్ క్యాప్ విన్నర్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్న అశ్విన్ హెబ్బార్‌కు రూ.లక్ష, పర్పుల్ క్యాప్ విన్నర్ సుదర్శన్‌కు రూ.లక్ష బహుమతిని సన్ ఇనిస్టిట్యూట్ ద్వారా అందజేసినట్లు తెలిపారు.